31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:23 AM Page 1

SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 27 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 31 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



# ముంచిన మొంథా

## రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియజేయాలి

విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి

వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి


నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సీఎం పర్యటన

"ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు."



**హైదరాబాద్, అక్టోబర్ 30:** శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2 లో



## ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం

తుపాను నష్టం రూ.5,265 కోట్లు

- వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు
- ఆర్‌అండ్‌బికి రూ.2,079 కోట్ల మేర నష్టం
- సకాలంలో విద్యుత్ పునరుద్ధరించాం
- అధికారులు సమన్వయంతో పనిచేయడంతో తప్పిన ముప్పు
- అధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు

5





మహిళల వన్డే ప్రపంచకప్

## ఫైనల్‌లో భారత్

ఉత్కంఠ రేపిన సెమీ ఫైనల్లో భారత జట్టు జయభేరి మోగించింది.. ఎనిమిదిసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియాకు చెక్ పెడుతూ రికార్డు లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే ఊదిపడేసింది. భారీ ఛేదనలో జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో చెలరేగగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేశారు. ఆఖర్లో రీచా ఘోష్(26), అమన్‌జోత్ కౌర్(11 నాటౌట్) ఒత్తిడిలోనూ గొప్పగా ఆడారు. దాంతో.. వరల్డ్ కప్ నాకౌట్ చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది టీమిండియా. 5 వికెట్ల తేడాతో కంగారూలను ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో తలపడనుంది.

.. వివరాలు 7లో



## నేడు కేబినెట్ విస్తరణ

అజారుద్దీన్ కోసం ప్రత్యేకం

రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

వివరాలు 6వ పేజీలో



## ప్రాణముండగానే మార్చురీకి

..2లో

రాత్రంతా ఏడుపులు..లోపలికి వెళ్లి చూస్తే షాక్

మహబూబాబాద్‌దవాఖానలో దారుణ ఘటన

ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం



## వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన జంట

యువకుడు క్షేమం.. యువతి గల్లంతు

..2లో

## తిరుమల కల్తీ నెయ్యి కేసు

చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు



.. వివరాలు 4లో



## మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి

అజారుద్దీన్‌కు పదవి కేవలం మైనార్టీలను దువ్వడమే

ఎన్నికల అధికారికి బీజేపీ నేతల ఫిర్యాదు

.. వివరాలు 3లో



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

## జస్టిస్ సూర్యకాంత్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు


మిగతా 2 లో

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

..3లో




04

## ముంబైలో 20మంది పిల్లల నిర్బంధం

విడిపించే క్రమంలో పోలీస్ కాల్పుల్లో వ్యక్తి మృతి

ముంబైలో ఒక వ్యక్తి సుమారు 20 మంది పిల్లలను స్టూడియోలో నిర్బంధించాడు. తన డిమాండ్ల కోసం కొందరితో మాట్లాడాలంటూ వీడియో రిలీజ్ చేశాడు. చివరకు పోలీస్ కాల్పుల్లో ఆ వ్యక్తి మరణించాడు.

31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:23 AM Page 2





# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

**అజారుద్దీన్ కోసం ప్రత్యేకం ● రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు**

**హైదరాబాద్, అక్టోబర్ 30:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# ప్రాణముండగానే మార్చురీకి

**రాత్రంతా ఏడుపులు..లోపలికి వెళ్లి చూస్తే షాక్**

**మహబూబాబాద్‌దవాఖానలో దారుణ ఘటన**



**మహబూబాబాద్, అక్టోబర్ 30:** వైద్యం కోసం వచ్చిన రోగిని ఆధార్ కార్డు లేదనే నెపంతో ఆసుపత్రిలో చేర్చుకునేందుకు ఆసుపత్రి సిబ్బంది అంగీకరించలేదు. ఆసుపత్రి ఆవరణలో రోగి.. వైద్యం కోసం రెండు రోజుల పాటు పడిగాపులు కాస్తూ నిరీక్షించి నీరసించడంతో సిబ్బంది మృతి చెందాడనే అనుమానంతో మార్చురీలో భద్రపరిచిన అమానవీయ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. చిన్న గూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వి.రవి మూత్ర పిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ మూడు రోజుల క్రితం జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చాడు. రోగికి తోడుగా ఎవ్వరు ఉండక పోవడంతో పాటు ఆధార్ కార్డు లేకపోవడంతో ఆసుపత్రిలో చేర్చుకోవడానికి వైద్య సిబ్బంది నిరాకరించారు. దీంతో రోగి 2 రోజుల పాటు ఆస్పత్రి ఆవరణలో పడిగాపులు పడి.. నీరసించి ఆ చేతనంగా మారిపోయాడు. రోగి మృతి చెందాడనే అనుమానంతో వైద్య సిబ్బంది ఆసుపత్రిలోని మార్చూరికి తరలించి భద్ర పరిచారు. మరుసటి రోజు మార్చురిని శుభ్ర పరచడానికి వచ్చిన స్వీపర్లు.... రోగి కదలికలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని రోగిని వైద్యం చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ఇంత దారుణం జరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగి పట్ల ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు.. మానవత్వం మంటగలిపారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన జంట

**యువకుడు క్షేమం.. యువతి గల్లంతు ● జనగామ జిల్లాలో విషాద ఘటన**





**జనగామ, అక్టోబర్ 30:** జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద దాటికి బైక్‌పై వెళ్తున్న యువతీ, యువకుడు కొట్టుకుపోయారు. హైదరాబాద్‌కు చెందిన బరిగల శివకుమార్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెదిన యువతి శ్రావ్య ఇద్దరు కలిసి బైక్ వస్తున్నారు. ఈ క్రమంలో స్టేషన్ ఘనపూర్ నుంచి జఫర్‌ఘడ్ వెళ్లే ప్రధాన రహదారిపై తిమ్మంపేట గొల్ల మత్తడి వద్ద రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరదను లెక్క చేయకుండా దాటే ప్రయత్నం చేయగా బైక్‌తో సహా ఇద్దరు కొట్టుకుపోయారు. శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకొని సురక్షితంగా బయటపడ్డాడు. యువతి మాత్రం గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు గొల్ల మత్తడి వద్దకు చేరుకుని 30 మంది ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తున్నారు. కాగా, యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తూ అమ్మాయిని ప్రైవేట్ హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శ్రావ్య చదువుతున్నట్లు సమాచారం. బోళ్ల మత్తడి వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో వెంకన్న, ఏసీపీ నరసయ్య సమీక్షిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రైతులకు వేదన మిగిల్చిన మొంథా తుఫాన్

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, అవుట్ ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల



నేపథ్యంలో గురువారం వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయండి

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్**

**హైదరాబాద్, అక్టోబర్ 30:** రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిం దని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

# వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

**సీఎస్, డీజీపీకి ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, అక్టోబర్ 30 :** వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. హనుమకొండలో మూడు పునరావాస కేంద్రాలు, వరంగల్లో 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

# రైతులను ఆదుకుంటాం

**● పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన**

**సిద్దిపేట, అక్టోబర్ 30:** సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్‌లో పర్యటించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు





# హన్మకొండలో మేయర్, కమిషనర్ల వాహనాలు అడ్డగింత


హన్మకొండసమ్మయ్యనగర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ చాహత్ , మేయర్ సుధారాణి వాహనాలను వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండలో వరద ఉద్రిక్తత ఏర్పడింది. మొంథా తుఫాన్ కారణంగా పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ళలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ సైతం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:23 AM Page 3



# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం




**హైదరాబాద్, అక్టోబర్ 30:** నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల బరిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అయితే ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి.. తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ఈ స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. అందుకోసం ఈ అసెంబ్లీ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్య కారణంగా ఆయన జూన్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. అలాగే బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి గెలిచి మూడో స్థానంలో ఆయన నిలిచిన విషయం విదితమే. మరో వైపు ఈ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపుపై మైనార్టీల ఓట్లు అధిక ప్రభావం చూపిస్తుంది. కానీ రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ముస్లిం మంత్రి ఒక్కరు కూడా లేరు. దీనిని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి వేళ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 ఏడాది చివరిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజారుద్దీన్ బరిలో నిలిచి.. రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో అజారుద్దీన్‌తోపాటు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కొదండరామ్‌ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన దస్త్రాన్ని గవర్నర్‌కు పంపింది. కానీ దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో అజారుద్దీన్‌కు తొలుత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. దీనికి బీఆర్ఎస్, బీజేపీలో మోకాలడ్డుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నవంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలువడనున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ఎత్తులు వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సరెండర్ అయిందని.. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు బీజేపీ సరెండర్ అయిందని ఆరోపించారు. ఆ క్రమంలోనే బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే అజారుద్దీన్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. అజారు–ద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం జరగకుండా ఉండేందుకు గవర్నర్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెలుపల ఎన్నికల కోడ్ లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని కరగ్‌పూర్ నియోజకవర్గంలో పోలింగ్‌కు ముందు అభ్యర్థిని మంత్రిగా బీజేపీ ప్రకటించిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అజారుద్దీన్.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అభ్యర్థి కూడా కాదు. అయినా అభ్యంతరం ఎందుకు అంటూ సందేహం వ్యక్తం చేశారు.అ అయితే తమ ప్రభుత్వానికి స్పష్టత, సంకల్పం ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి

- అజారుద్దీన్‌కు పదవి కేవలం మైనార్టీలను దువ్వడమే
- జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య
- ఎన్నికల అధికారికి బీజేపీ నేతల ఫిర్యాదు





**హైదరాబాద్, అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసేలా చేస్తున్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇది కేవలం ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునే చర్య తప్ప మరోటి కాదని పేర్కొంది. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని అంటూ పాయల్ శంకర్ అన్నారు. ఒకవేళ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలి అనుకుంటే ఎన్నిక తర్వాత ఇవ్వాలి. కానీ ఉన్నఫళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మర్రి శషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల లబ్ధి కోసం ఒక వర్గం ఓట్లు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారు. ఆ వర్గంపై ప్రేమ ఉంటే గతంలో ఎందుకు ఇవ్వలేదు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలంటూ కోరాం. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడంకోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు.

# నా రాజకీయ జీవితంపై బురదజల్లే యత్నం

- తరచూ పార్టీ మారుతున్నారంటూ దుష్ప్రచారం
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసహనం




**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 30:** తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఖండించారు. రాజకీయంగా తాను ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆయనే ప్రెస్ మీట్ పెట్టి చెబుతాను అంటూ క్లారిటీ ఇచ్చారు. పార్టీ మార్పు అంటూ తప్పుడు ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని లక్కారం, చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని చెరువులను పరిశీలించి గంగ పూజను నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని చెరువు నిండినప్పుడు కాలనీలు జలమయం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం, రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..' చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి 500 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపుదిద్ద బోతున్నాం. చౌటుప్పల్ చెరువుకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా ప్రణాళికలు వేసి దండు మల్కాపురం, లక్కారం వద్ద వరద నీటిని డైవర్ట్ చేయడంతో మున్సిపాలిటీ ప్రజలకు వరద ముప్పు తప్పిందని తెలిపారు. పార్టీ మారుతున్నానని సొంత పార్టీ వాళ్లు, బయట పార్టీ వాళ్లు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు దుష్ప్రచారాలను ఎవరు నమ్మవద్దు. నేను ఏదైనా నిర్ణయం తీసుకున్నట్లయితే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మరి ప్రకటిస్తాను. నేను ప్రస్తుతం సిన్సియారిటీ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తను, ఎమ్మెల్యేను.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే పని చేస్తాను. క్రమశిక్షణ గల కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా కార్యకర్తగా అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా దానికి కట్టుబడి ఉంటా. నా ముందు మునుగోడు అభివృద్ధి తప్ప, మరో ఆలోచన లేదు. నాపై సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దు అంటూ కామెంట్స్ చేశారు.

# హరీష్ రావుకు కవిత దంపతుల పరామర్శ

**హైదరాబాద్, అక్టోబర్ 30:** మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటికి కల్వకుంట్ల కవిత వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్తతో కలసి వెళ్లి హరీష్ రావును పరామర్శించారు. రెండు రోజుల క్రితం హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కవిత అంత్యక్రియలకు హాజరుకాలేదు. దీనితో హరీష్‌రావుతో ఉన్న విభేదాల కారణంగానే రాలేదని అనేక ఊహాగానాలు చెలరేగాయి. అయితే మూడు రోజుల తర్వాత, గురువారం ఉదయం కవిత హరీష్‌రావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే.. గతంలో మాజీ మంత్రి హరీష్‌రావుపై సంచలన ఆరోపణలు చేశారు కవిత. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో హరీష్‌రావుపై మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై హరీష్‌రావు ప్రత్యక్షంగా స్పందించలేదు. తాను ఉద్యమం నుంచి ఉన్నారని, తన ప్రస్థానం తెరిచిన పుస్తకమంటూ పరోక్షంగా స్పందించారు. కవిత హరీష్‌రావుపై చేసిన ఆరోపణల అనంతరం ఆమె ఆయన ఇంటికి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ తాజా తరుణం అటు బీఆర్ఎస్ ఇటు జాగృతి శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తించింది.

# పిల్లల ప్రాణాలతో చెలగాటమొద్దు: సజ్జన్నార్



**హైదరాబాద్,అక్టోబర్ 30:** ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో హ్యాండిల్ పట్టుకొని ఓ ద్విచక్రవాహనదారుడు ప్రమాదకర రీతిలో పిల్లలను స్కూలుకు తీసుకెళ్లిన ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. గుడిమల్కాపూర్‌లో ఓ వ్యక్తి చిన్నారులను బైక్‌పై ప్రమాదకరంగా తీసుకెళుతుండటంపై 'ప్రమాదమని తెలిసీ ప్రాణాలతో చెలగాటం ఆడడటంపై ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇలా బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టు తప్పితే బాధ్యులెవరని ప్రశ్నించారు. వర్షంలోనూ పిల్లల చదువుపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్ రూల్స్ నేర్పించడంలో ఎందుకు ఉండడం లేదన్నారు. ఇలా ప్రమాదకర ప్రయాణం చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చలగాటమాడొద్దని సూచించారు. ప్రజలంతా ఆలోచించాలని, ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఈ సందర్భంగా సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?


## రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి



**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷–దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు పదవి


## ఎక్స్ వేదికగా కేటీఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారు–ద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన

## కాంగ్రెస్ అభ్యర్థి యాదవ్‌పై ఈసీకి ఫిర్యాదు



**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. వారం రోజుల్లో బీఆర్ఎస్ కేడర్‌ను లేకుండా చేస్తానన్న నవీన్ యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, కె.కిషోర్ గౌడ్, రామచంద్రు నాయక్, ఉపేంద్ర చారి ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ క్యాడర్‌ను ఉద్దేశించి 'గల్లీ దాటరు.. ఇంటిని చూడరు' అంటూ బెదిరించిన ఆయన తాజాగా గులాబీ క్యాడర్‌నే లేకుండా చేస్తానని బెదిరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. తాజాగా ఓ యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సదరు యాంకర్ 'బీఆర్ఎస్ క్యాడర్‌ను లేకుండా చేస్తా అంటున్నారు.. నిజంగా లేకుండా చేస్తారా?' అని ప్రశ్నించగా 'ఏసేస్తా'? వారం రోజుల్లో బీఆర్ఎస్ క్యాడర్ లేకుండా చేస్తా' అంటూ మరోసారి ధమ్కీ ఇచ్చారు. దీనిపైనా సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. రౌడీబిడ్డకు టికెట్ ఇస్తే ఇలాంటి బెదిరింపులకే పాల్పడతారు, జూబ్లీహిల్స్ ఓటర్లూ బహుపరాక్ అని పలువురు సూచించారు. అయితే నవీన్‌యాదవ్ ఎన్ని ధమ్కీలు ఇచ్చినా బీఆర్ఎస్ క్యాడర్‌ను ముట్టుకోవడం కూడా సాధ్యం కాదని బీఆర్ఎస్ నేతలు బదులిస్తున్నారు.

# టీజీ సెట్ - 2025 దరఖాస్తు గడువును పొడగింపు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ – 2025 దరఖాస్తు స్వీకరణ గడువును పొడగించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.1500 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు, రూ.3000 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. డిసెంబర్ నెల రెండో వారంలో పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 0040–27097733, 8331040950 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఓయూ డిగ్రీ పరీక్షల తేదీల ఖరారు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీబీఏ, బీబీఏ అనాలిటిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లిలిలి.నీబపజీనితిజీ.జీఇ.తినిలో చూసుకోవచ్చని సూచించారు.

31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:23 AM Page 4





## సంపాదకీయం

# సహాయ, పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి!

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉద్ధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్దరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.



# ముంబైలో 20మంది పిల్లల నిర్బంధం

- విడిపించే క్రమంలో పోలీస్ కాల్పుల్లో వ్యక్తి మృతి

**ముంబై, అక్టోబర్ 30:** ఒక వ్యక్తి సుమారు 20 మంది పిల్లలను స్టూడియోలో నిర్బంధించాడు. తన డిమాండ్ల కో ఓసం కొందరితో మాట్లాడాలంటూ వీడియో రిలీజ్ చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. చివరకు పోలీస్ కాల్పుల్లో ఆ వ్యక్తి మరణించాడు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. పోవై ప్రాంతంలోని ఆర్ఏ స్టూడియోలో యాక్టింగ్ క్లాసులు జరుగుతుంటాయి. రోహిత్ ఆర్య అనే వ్యక్తి ఆ స్టూడియోలో పని చేస్తున్నాడు. అతడికి యూట్యూబ్ ఛానెల్ కూడా ఉన్నది. 4 రోజులుగా రోహిత్ ఆడిషన్లు నిర్వహిస్తున్నాడు. దీంతో గురువారం ఉదయం సుమారు వంద మంది పిల్లలు ఆడిషన్ల కోసం ఆ స్టూడియోకు వచ్చారు. అయితే 80 మంది పిల్లలను అతడు బయటకు వెళ్లనిచ్చాడు. సుమారు 20 మంది పిల్లలను స్టూడియో లోపల ఉంచి నిర్బంధించాడు. దీంతో తమను కాపాడాలంటూ వారు హాహాకారాలు చేశారు. మరోవైపు రోహిత్ ఆర్య ఆ తర్వాత ఒక వీడియో క్లిప్ విడుదల చేశాడు. కొంత మంది వ్యక్తులతో మాట్లాడటం కోసమే పిల్లలను బందీలుగా ఉంచినట్లు తెలిపాడు. తనకు పెద్దగా ఆర్థిక డిమాండ్లు లేవని చెప్పాడు. తన డిమాండ్లు నైతికమైనవని అన్నాడు. పోలీసులు, అధికారులు దూకుడుగా వ్యవహరించవద్దని, తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరించాడు. తన డిమాండ్లు నెరవేర్చకపోతే ఆ ప్రాంగణానికి నిప్పు పెడతానని, తనతో పాటు పిల్లలకు హాని జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. కాగా, పిల్లల కిడ్నాప్, నిర్బంధం గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో ఆ స్టూడియో ముందు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసి నిర్బంధించిన రోహిత్ ఆర్యతో మాట్లాడారు. మరోవైపు పిల్లలందరినీ రక్షించి వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడు ఎందుకు ఇలా చేశాడు అన్నది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా అస్థిరంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే పోలీస్ కాల్పుల్లో గాయపడిన అతడ్ని హాస్పిటల్‌కు తరలించగా మరణించాడు. ఈ సంఘటన ముంబైలో కలకలం రేపింది.






# చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట

## అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30 :** ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర. ఇప్పటికే న్యూదిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్ (ఎనిటతిజీ-ఎసజీని)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కౌంటర్ ఇచ్చారు.



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ సూర్యకాంత్

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసు

## చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు



**తిరుమల, అక్టోబర్ 30:** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు కీలక మలుపు తిరిగింది. కల్తీ నెయ్యి సరఫరా వెనుక భారీ కుట్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్నఅప్పన్న అరెస్టుతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. 2022 తితిదే కొనుగోళ్ల విభాగం జీఎంను అప్పన్న సంప్రదించారు. నెయ్యి సరఫరా చేసే భోలేబాబా డెయిరీ యాజమాన్యానికి ఫోన్ చేశారు. ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు భోలేబాబా డెయిరీ యాజమాన్యం నిరాకరించింది. దీంతో ఆ డెయిరీపై అనర్హత వేటు వేసేలా చిన్నఅప్పన్న కుట్రకు తెరలేపారు. డెయిరీని తనిఖీ చేయాలంటూ తితిదే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. డెయిరీపై అనర్హతవేటు వేసేలా అజ్ఞాతవ్యక్తులతో పిటిషన్లు వేయించారు. చిన్నఅప్పన్న కుట్రతో బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరణను తితిదే నిలిపివేసింది. ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రవేశించి.. రూ.138 ఎక్కువ కోట్ చేసింది. పోటీ లేకపోవడంతో కాంట్రాక్టు దక్కించుకుంది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది.



# విమానంలో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

**హైదరాబాద్,అక్టోబర్ 30:** జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా చాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు. వారు అతనికి సీపీఆర్ చేశారు. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయిన వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో అంబర్‌పేటలోని స్వగ్రహానికి తరలించారు.

# మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. గురువారం రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.



31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:23 AM Page 5



# ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం



**అమరావతి :** 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు. అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

# యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్

**అమరావతి :** యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

### క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేశ్

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.

### అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

### విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ

'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యాగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ, ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పునఃశిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

# తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం

- పైరు పొట్ట దశలో ఉండగా తుపాను దెబ్బ
- 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి
- రైతులకు తోడుగా నిలబడాలని పార్టీ నేతలకు జగన్ పిలుపు



**అమరావతి :** తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా దెబ్బతింటాయి. నేలకొరిగిన పంట తిరిగి నిలబడ్డం కష్టమయ్యే పరిస్థితి. దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయం తో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలన్నారు. 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామన్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదని జగన్ విమర్శించారు.



# సీఎం ముందస్తు చర్యలతో నష్టనివారణ

- కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటీ సీఎం
- బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్

**విజయవాడ :** ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# తెనాలిలో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



**గుంటూరు :** మొంథా తుఫాన్ ప్రభావంతో తెనాలి పట్టణంలో అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న పేదలకు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో 4,553 పునరావాస కేంద్రాలలో 9,451 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. పట్టణంలో 8 పునరావాస కేంద్రాలలో ఉన్న 615 మందికి 25 కేజీల చొప్పున బియ్యం, కూరగాయలు, సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి రామ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు కష్టాల్లో ఉంటే అబద్దాలు ప్రచారమా

## జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ :** రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉంటే.. గదిలో కూర్చొని జగన్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి.. సిగ్గులేకుండా అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మొంథా తుపాను నేపథ్యంలో కృష్ణా జిల్లా పెనమలూరు, వెంట్రుపగడలో మంత్రి పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. కేవలం విమానం లేదన్న సాకుతో బెంగళూరు నుంచి రాని వ్యక్తి.. గదిలో కూర్చొని విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పంటల బీమాపై జగన్ పచ్చి అబద్దాలు చెబుతున్నారు. దమ్ముంటే టెలీకాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలపై జగన్ చర్చకు రావాలి. వాస్తవ నివేదికలతో మేం కూడా చర్చకు వస్తాం. గత ప్రభుత్వం 40? కూడా చేయని ఈ-క్రాప్‌ను మేం 95శాతం చేశాం. మామిడికి కేజీకి రూ.4 ఇచ్చి రూ.300 కోట్లు ఖర్చు పెడితే.. మామిడి రైతులను పట్టించుకోలేదని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ బీమా వాటా చెల్లించలేదని సాక్షాత్తు అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి బహిరంగంగా చెప్పారు. రైతుల ప్రతి విషయంలోనూ అబద్దాలు ప్రచారం చేస్తూ.. వైకాపా నేతలు అభాసుపాలవుతున్నారని అచ్చెన్నాయడు అన్నారు.

# తిరుమల ఈవోతో శ్రీశైలం ఛైర్మన్ భేటీ

### శ్రీశైలంలో టీటీడీ వసతి సమాదాయానికి వినతి

**తిరుమల :** టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ను శ్రీశైలం ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గురువారం కలిశారు. తిరుమలలో జరిగిన ఈ భేటీలో స్వామివారి వస్త్రము, ప్రసాదం అందజేసి దోర్నాల దగ్గర భక్తులు, యాత్రికుల కోసం టీటీడీ వసతి సముదాయం, డార్మెటరీ నిర్మించాలని కోరారు. అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ క్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించారని.. టీటీడీ తరపున బోర్డు మెంబెర్ భాను ప్రకాష్ రెడ్డిని శ్రీశైలం వెళ్లి ఎన్ని గదులు అవసరం అవుతాయో పరిశిలించి టీటీడీ పాలకమండలి తెలియజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పదిరోజుల్లో శ్రీశైలం దర్శనానికి వచ్చి వసతి సముదాయాల గురించి పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక ఇస్తామని చెప్పారని అన్నారు రమేష్ నాయుడు. అడిగిన వెంటనే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా వసతి గదుల సముదాయం నిర్మిస్తామని చెప్పినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోతో పాటు టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీ, ఆరోగ్యానికి, సేవకు చిహ్నంగా ముందడుగు

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.




**నారాయణపేట జిల్లా, అక్టోబర్,30(సమయం న్యూస్) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ సావర్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగి, చివరగా ఎస్పీ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ యువత, విద్యార్థులు, చిన్నారులు, పోలీసులు, ప్రజలతో కలిసి సైక్లింగ్ చేస్తూ, "జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్" అంటూ నినాదాలు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి రోజు సైక్లింగ్ చేయడం వల్ల శరీర దృఢత్వం పెరగడమే కాకుండా మనసుకు ఉత్తేజం లభిస్తుంది అని ఆరోగ్యంగా ఉంటే విధుల్లో మరింత సమర్థతతో రాణించవచ్చు అని తెలిపారు. పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా ఈ సైకిల్ ర్యాలీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినివ్వాలి అని ఎస్పీ పేర్కొన్నారు. అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు, విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాలీలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య,మహేష్, సీఐ శివశంకర్, ఆర్ఐ నరసింహ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, శివశంకర్, శ్వేత, శిరీష, కృష్ణ చైతన్య,పిఈటి రమణ,యోగ సభ్యులు, విద్యార్థులు, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అన్నారం గ్రామంలో వివిధ పంటల నమోదు ప్రక్రియను పరిశీలించిన ఏడీఏ శంకర్ రాథోడ్

● పండించిన పంటకు పండించిన పంట వివరాలను నమోదు చేసుకోవాలి



**కొడంగల్ మండలం, అక్టోబర్,30(సమయం న్యూస్) :** పంట నమోదు పరిశీలనలో భాగంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని అన్నారం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారు లు చేపడుతున్నటువంటి వివిధ పంటల నమోదు ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు కొడంగల్ కె శంకర్ రాథోడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతు సోదరులు తమ పండించినటువంటి పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు దీని ద్వారా రైతు భరోసా, పంటను అమ్ముకునేటప్పుడు రైతు వివరాలు కొనుగోలు కేంద్రాలలో ఉపయోగపడతాయి కాబట్టి రైతులు తప్పనిసరిగా పండించిన పంటకు పండించిన పంట వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా కోరనైనది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతుల కోసం చేపడుతున్నటువంటి పథకాలు అమలు కావడానికి ఉపయోగపడతాయని సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దేవేందర్ మరియు రైతులు పాల్గొన్నారు

## అకాల వర్షంతో అపార నష్టం

● మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



**తొగుట అక్టోబర్ 30 సమయం న్యూస్** అకాల వర్షం తో రైతులకు అపార నష్టం వాటిల్లిందని తొగుట మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మొంథా తుపాన్ మూలంగా మండలంలోని వెంకట్రావుపేట లో నష్టపోయిన పంట చేలను, మొలకెత్తిన వరి, మొక్కజొన్న ధాన్యం ను ఆయన పరిశీలించారు. అరుగాలం కష్టపడి పంట సాగుచేసిన రైతులకు పంట చేతికి వొచ్చిన సమయంలో వర్షాల మూలంగా తీరని నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా వర్షాల మూలంగా చేతికి వొచ్చిన పత్తి చెజారి పోతుందని, వరి, మొక్కజొన్న ధాన్యం తడిచి మొలుకెత్తుతున్నాయన్నారు. ఆలస్యంగా మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభించడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. తడిసిన ధాన్యం ను, పత్తి ని కొనుగోలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వం ను ఆయన డిమాండ్ చేశారు.

# భారతదేశ ఉక్కు చట్రం-అఖిల భారత సేవలు

**ఖమ్మం , అక్టోబర్ 31:( సమయం న్యూస్) :** స్వాతంత్ర్యానంతర భారతదేశంలో, అఖిల భారత సర్వీసులు (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్) దేశ పరిపాలనకు వెన్నెముకగా నిలుస్తూ కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని నిర్ధారిస్తాయి, పాలన పౌరుల మధ్య అంతరాన్ని తగ్గిస్తాయి. వారి సహకారం సర్దార్ పటేల్ దార్శనికత బలమైన, ఏకీకృత, ప్రతిస్పందనాత్మక దేశం యొక్క పనితీరును ఎలా మార్గనిర్దేశం చేస్తుందో ప్రతిబింబిస్తుంది." ది బర్త్ ఆఫ్ ది స్టీల్ ఫ్రేమ్ "కొత్తగా స్వతంత్రం పొందిన దేశం యొక్క దుర్బలత్వాన్ని గుర్తించిన సర్దార్ పటేల్, వృత్తిపరమైన, తటస్థ, ప్రభావవంతమైన పౌర సేవ ల అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ "ఉక్కు చట్రం" కేంద్రాన్ని రాష్ట్రాలతో అనుసంధానిస్తుంది, విధానాలను సమానంగా అమలు చేస్తుంది, ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ శాంతిభద్రతలను కాపాడుతుంది. రాజకీయ ఐక్యత మాత్రమే సరిపోదని పటేల్ అర్థం చేసుకున్నాడు. బలమైన సంస్థలు మాత్రమే సూత్రాలను, సూచనలు, ఆచరణాత్మక పాలనలోకి అనువదించగలవు, శాంతిని నిలబెట్టగలవు వృద్ధిని సాధ్యం చేయగలవు.

" పరిపాలనా సమన్వయం, స్థిరత్వం "...జిల్లాలు, రాష్ట్రాలలో అఖిల భారత సర్వీసుల అధికారులను నియమిస్తారు, వారు విధానానికి - ప్రజలకు మధ్య క్రియాత్మక సంబంధంగా వ్యవహరిస్తారు. ఎన్నికలను పర్యవేక్షించడం నుండి సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేయడం వరకు, వారు చట్ట పాలన, సమానత్వం, జాతీయ సమైక్యతను సమర్థిస్తారు. ప్రతి జిల్లాలో వారి ఉనికి పాలన పట్టణ కేంద్రాలలో మాత్రమే కేంద్రీకృతమై ఉండదని నిర్ధారిస్తుంది, ప్రతి పౌరుడిని జాతీయ ప్రాజెక్టులో భాగస్వామిగా చేస్తుంది. అనేక ప్రాంతాలలో, అధికారులు విపత్తు ప్రతిస్పందన, స్థానిక ప్రణాళిక, సామాజిక చొరవలలో అదనపు పాత్రలను పోషిస్తారు, ఇది ఉక్కు చట్రం యొక్క బహుమితీయ ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది.

" సంక్షోభ నిర్వహణ, నేషన్ బిల్డింగ్ "...ప్రకృతి వైపరీత్యాలు అయినా, పౌర అశాంతి అయినా, మహమ్మారి అయినా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు కొనసాగింపు, సమన్వయం, నాయకత్వాన్ని అందిస్తారు. కేంద్ర ఆదేశాలను స్థానిక వాస్తవాలతో సమన్వయం చేయగల వారి సామర్థ్యం భారతదేశం అంతర్గత సవాళ్లను తట్టుకోవడానికి , వైవిధ్యంలో ఐక్యతను కొనసాగించడానికి వీలు కల్పిస్తుంది. అస్సాంలో వరదల నుండి గుజరాత్‌లో భూకంపాల వరకు సంక్షోభాల సమయంలో దేశం యొక్క స్థితిస్థాపకత దీనికి నిదర్శనం.

అవసరమైన సేవలను అందించడంలో భరోసా ఇస్తూ సమాజాలను స్థిరీకరించడంలో ఈ అధికారుల అనివార్య పాత్రను ప్రదర్శిస్తుంది.

" జాతీయ విలువలను పొందుపరచడం "...శిక్షణ, పరిపాలన, పౌరులతో రోజువారీ సంభాషణ ద్వారా, అఖిల భారత సర్వీసులు భాగస్వామ్య బాధ్యత, జాతీయ ప్రయోజనం యొక్క భావాన్ని పెంపొందిస్తాయి. అధికారులు విభిన్న సమూహాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తారు, వివాదాలను పరిష్కరిస్తారు, విధానాలు కలుపుకొని ఉండేలా చూసుకుంటారు, తద్వారా పాలనలో ఏకీకరణ, నమ్మకం రెండింటినీ బలోపేతం చేస్తారు. ఈ రోజువారీ పని సామాజిక సమైక్యతను బలపరుస్తుంది, చట్టం పట్ల గౌరవం, న్యాయం, ఏకీకృత దేశానికి ఆధారమైన సాధారణ ప్రయోజన-విలువలను ప్రోత్సహిస్తుంది.

" తీర్మానం "...ఐక్య భారతదేశానికి బలమైన సంస్థలు అవసరమనే పటేల్ నమ్మకాన్ని ఆల్ ఇండియా సర్వీసెస్ ఉదాహరణగా నిలుస్తాయి. వారు దార్శనికతను ఆచరణలోకి, విధానాన్ని ఆచరణలోకి, భావజాలాన్ని స్పష్టమైన జాతీయ ఐక్యతగా మారుస్తారు. రాష్ట్రీయ ఏక్తా దివాస్ నాడు, జాతి నిర్మాణానికి వారి సహకారం ఏదైనా రాజకీయ లేదా సాంస్కృతిక ప్రయత్నం వలె చాలా ముఖ్యమైనది. దేశంలోని ప్రతి మూలలో ఏకత్వం, న్యాయంగా, జాతీయ సేవ యొక్క ఆదర్శాలు సజీవంగా ఉండేలా వారు నిర్ధారిస్తారు...

## మున్నేరు లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, అక్టోబర్ 30:( సమయం న్యూస్ ) :** మొంథా తుపాన్ ప్రభావం వలన ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదతో మున్నేరు వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మొంథా తుపానుతో ఎగువ జిల్లాలో మున్నేరు పరీవాహకంలో భారీ వర్షాలు కురవడంతో మూడవ ప్రమాద హెచ్చరికతో 25 అడుగుల మేరకు ఖమ్మం కాల్వొడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు ప్రవాహాన్ని గురువారం, నగర మేయర్ పునకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మున్నేరు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయించి, ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి ధంసలాపురం పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నయాబజార్ కళాశాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయించి, పలు కాలనీల ప్రజలను పునరావాస కేంద్రాలకు వాహనాల్లో తరలించినట్లు తెలిపారు. నెమ్మదిగా పెరుగుతున్న మున్నేరు నీటిమట్టం ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షిస్తూ సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మున్నేరు లోతట్టు ప్రాంత ప్రజల సహాయక చర్యలలో భాగంగా నయాబజార్ స్కూల్, నయాబజార్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు కల్పించిన వసతులు, భోజనం నాణ్యత, హెల్త్ క్యాంప్ ను పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి సమకూర్చిన సౌకర్యాల పై ఆరాతీసారు. చిన్న పిల్లలు, వృద్దులు, మహిళలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కలెక్టర్ అన్నారు. మొంథా తుపాన్ భారీ వర్షాలతో ఎగువ ప్రాంతంలో నుండి ఉధృతంగా వచ్చే వరదతో మున్నేరుకి వరద ముప్పు పెరుగుతుందని, ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 25 అడుగుల మేర ప్రవహిస్తోందని, అధికార యంత్రాంగం అంతా అప్ర మత్తంగా ఉన్నామని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి ఆదేశించారు. వరద పెరిగినందున మున్నేరు నది, బ్రిడ్జిల పైకి ప్రజలు అనవసరంగా రావద్దని, ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలం దరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఖమ్మం అర్డీవో నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా కలెక్టర్- సిక్తా పట్నాయక్



**మద్దూరు మున్సిపాలిటీ(మం)అక్టోబర్,30,(సమయం న్యూస్):** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా మద్దూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు స్టాక్ రిజిస్టర్ మందుల స్టాకు తదితర అంశాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఓపి ఎన్ని వస్తున్నాయని అడిగారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించి పరిశుభ్రత పై మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వైద్యులు వైద్య సిబ్బంది సకాలంలో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ఓపీ రిజిస్టర్ ప్రకారం 95 మంది రోగులకు 75 మందికి మాత్రమే మందులను ఇచ్చారని కలెక్టర్ ప్రశ్నించగా 75 మందికి మాత్రమే మందులు అవసరమని, మిగతా వారు కేవలం వైద్య పరీక్షలు మాత్రమే చేసుకున్నారని ఫార్మాసిస్టు తెలిపారు .అనంతరం కలెక్టర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బోధనా అంశాల గురించి విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సమ్మెటివ్ అసిస్మెంట్ పరీక్షలను జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారు అని అడిగారు. విద్యార్థులకు అందించే భోజనం సదుపాయల పై ఆరా తీశారు. విద్యార్థులకు ఫుడ్ సేఫ్టీ ముఖ్యమని విద్యార్థులకు భోజనం అందించక ముందు కమిటీ ద్వారా టేస్ట్ చేయాలన్నారు. మెస్ కమిటీ ఫాం చేశారా? మెస్ కమిటీలో ఎంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారని ప్రతి ఒక్కసారి రిజిస్టరును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నా రు.ఎల్.ఐ.పి. (లార్నింగ్ ఇంప్రువెమెంట్ ప్రోగ్రాం ) పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వెనుక బడిన సీ,డి గ్రూప్ విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవా లన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా విద్యార్థుల అటెండెన్స్ కు,జనరల్ రిజిస్టర్ కు తేడా ఉండడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఏ జి ఆర్ రిజిస్టర్, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్ లో విధిగా అన్ని వివరాలు ఉండాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండ పాఠశాలకు వచ్చేటట్లు చూడాలన్నారు. 800 వందల పైచిలుకు విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించా లన్నారు .ఎన్ ఎం ఎం ఎస్ కు ఎంతమంది సిద్ధం అవుతున్నారనీ, లైబ్రరీ లో ఎన్నిరకాల పుస్తకాలు ఉన్నాయని పార్ట్ 1 బుక్స్ వచ్చాయా ? పార్ట్ 2 బుక్స్ అందాయా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్ లో పరికరాల పై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు ఎలా బోదిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పోర్ట్స్ లో ఏయే ఆట వస్తువులు ఉన్నాయని అడగగా వాలి బాల్, ఫుడ్ బాల్ మరియు బ్యాట్, చెస్, ఆటవస్తువులు ఉన్నాయని రోజూ ఆడుతామని కలెక్టర్ కు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు మరుగుదొడ్లు అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన ఆమె శాంక్షన్ చేయిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఏం గోవిందా రాజు,జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, సి ఎం ఓ రాజేందర్ కుమార్, మధ్యాహ్న భోజన పథకం ఇంచార్జ్ యాదయ్య మండల విద్యాశాఖ అధికారి బాలకిష్టప్ప,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవిత పాల్గొన్నారు.

# తుఫాన్ సహాయక చర్యలలో ఆపద మిత్రలు కీలకపాత్ర

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, అక్టోబర్ 30:( సమయం న్యూస్ ) :** మొంథా తుఫాన్ సహాయక చర్యలలో ఆపద మిత్రలు కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. విపత్కర సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రతి మండలానికి కొంత మంది ఆపద మిత్రలను ఎంపిక చేసి వారికి అవసరమైన శిక్షణ గతంలో అందించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 300 మంది యువతకు ఆపదమిత్రలుగా ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చామన్నారు.ఖమ్మం జిల్లా మున్నేరు పరివాహక ప్రాంతంలో గల లోతట్టు ప్రాంతాలైన సారధి నగర్, బొక్కల గడ్డ, అగ్రహారం కాలనీ, వెంకటేశ్వర నగర్, పద్మావతి కాలనీలలో మొంథా తుఫాన్ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలు బుధ, గురువారాల్లో మున్నేరు లోతట్టు ప్రాంతాల ప్రజలను చైతన్య పరుస్తూ పునరావాస కేంద్రాలకు తరలించుటలో పూర్తిగా సహాయ



సహకారాలు అందించారని తెలిపారు.ప్రజలకు తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ, జిల్లా అధికారులతో సహాయక చర్యలలో చాలా చురుగ్గా పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ అన్నారు.

# తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్‌గా తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గటిక విజయ్ కుమార్ నియామకం

**వరంగల్ అక్టోబర్ 30. (సమయం న్యూస్) :** తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్‌గా డాక్టర్ గటిక విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య హైదరాబాద్‌లోని అశోక హోటల్‌లో జరిగిన బీసీ జేఏసీ సమావేశంలో అందజేశారు.ఈ బాధ్యతతో పెరిక కులానికి విశిష్ట గౌరవం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా పెరిక బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక ఉద్యమాలు, బీసీ హక్కుల సాధనలో ముందుండి పోరాడిన డాక్టర్ విజయ్ కుమార్ ఈ పదవికి సరైన వ్యక్తిగా భావిస్తూ నాయకులు, బంధువులు అభినందనలు తెలుపుతున్నారు.

వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన డాక్టర్ విజయ్ కుమార్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీనియర్ జర్నలిస్టుగా ఆయన పలు సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు.ఈ సందర్భంగా జరిగిన బీసీ జేఏసీ రాష్ట్ర సమావేశంలో, రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం, చట్టసభల్లో బీసీలకు సముచిత రిజర్వేషన్లు సాధించి రాజ్యాధికారంలో వాటా పొందడం లక్ష్యంగా ముందుకు సాగాలని



నిర్ణయించారు.త్వరలోనే బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ రథయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి సమన్వయం కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కోఆర్డినేటర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సంఘం కోశాధికారి సందెల లింగం పాల్గొన్నారు.

# మొంధా తూపాన్ తో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

- మెదక్ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు
- ఇల్లెందుల రమేష్

**రాయపోల్ అక్టోబర్ 30 ( సమయం న్యూస్) :** రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలు మొంథా తుఫాన్ ప్రభావం ఫలితంగా రైతుల పంటలు తీవ్రంగా నష్టపోయాయని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని మెదక్ పార్లమెంటు టిడిపి అధ్యక్షులు ఇల్లెందుల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ..

మొందా తూపాన్ తో పంట పొలాలు కి నీరు వచ్చి చేతికొచ్చిన పంట మొత్తం నాశనం అయ్యిందని దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా సిద్ధిపేట డివిజన్ లో మరియు సదాశివపేట ,కొండాపూర్,నారాయణ్ ఖేడ్,రాయికోడ్ తదితర మండలాల్లో పెద్ద ఎత్తున చేతికొచ్చిన పత్తి ,వరి పంటలు మొత్తం చేన్లలోకి నీరు వచ్చి మొత్తం నాశనం అయ్యి పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారని వీరందరికి ప్రభుత్వం తరపున ఎకరాకు కనీసం 20 వేల రూపాయలు చెల్లించి



ఆదుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.ఉమ్మడి జిల్లా లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని తెలిపారు.మార్కెట్ యార్డులో ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిందని కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. రైతులు పండించిన పంటలు వర్షానికి తడిసిపోవడంతో తల్లడిల్లి పోతున్నారని. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని. అలాగే మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే పంట నష్టం జరిగేది కాదని. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషి చేయాలని ఆయనపేర్కొన్నారు.

# నిబంధనల ప్రకారం లేఔట్ అనుమతులు జారీ

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, అక్టోబర్- 30:( సమయం న్యూస్ ):** ఖమ్మం నగరంలో లేఔట్ అనుమతుల జారీ అంశంలో నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పాల్గొన్నారు.పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను సాంకేతికతను వినియోగిస్తూ జిల్లా కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు.లేఔట్ అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలని అన్నారు. చివరి నిమిషంలో నాలా కన్వర్జేషన్ సంబంధించి ఫీజు చెల్లింపులు చేసి సమావేశానికి తీసుకుని వచ్చిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలించి పూర్తి స్థాయిలో అన్ని నిబంధనలు పాటిస్తున్నారో లేదో గమనించాలని కలెక్టర్ అన్నారు.లేఔట్ లో అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉ



ండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లే ఔట్ లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ లో స్ట్రీట్ లైట్స్, సీవరేజి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ త్రాగునీటి సరఫరా విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండాలని అన్నారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ని బంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయా లని, మనం జారీ చేసిన నిబంధనలు అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా రెగ్యులర్ పర్య వేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎస్డీసి ఎం.రాజేశ్వరి, పం చాయతీ రాజ్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, మునిసిపల్, ఇరిగే షన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి లేక్స్ చీఫ్ ఇంజనీర్ ను కలిసిన మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్



**హైదరాబాద్ అక్టోబర్30( సమయం న్యూస్).:** ఈ రోజు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ జిహెచ్ఎంసి లేక్స్ చీఫ్ ఇంజనీర్ జ్యోతిర్మయి గారిని కలవడం జరిగినది.ముఖ్యంగా సఫిల్గుడా చెరువు, బండ చెరువు లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిధులతో మురిగినీటి శుద్దీకరణ, డైవర్షన్ కోసం అందించిన నిధులను క్షేత్రస్థాయిలో పనుల చేపట్టేందుకు వినియోగించాలని కోరడం జరిగినది. కేంద్ర ప్రభుత్వం నగరంలో చెరువుల శుద్ధికరణకు దాదాపు 500 కోట్ల రూపాయలను కేటాయించినా, రాష్ట్ర ప్రభుత్వం దానికి సంబంధించిన అనుమతులు జారీ చేయకుండా తాత్సారం చేస్తుందని దానివల్ల ప్రజలు నష్టపోతున్నారని దోమలు పెరిగి డెంగ్యూ లాంటి భయంకరమైన రోగాలు ప్రబలుతున్నాయని అన్నారు. చెరువును కాపాడడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాల్సి ఉందని దుయ్యబట్టారు. తొందర్లో వీటికి సంబంధించిన అనుమతులను పూర్తి చేసి పనులు ప్రారంభించని యెడల వారి కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో ముట్టడించి వంటావార్పు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# బాల్య వివాహేలు, ఆగయిత్యాల గురించి తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నెంబర్ కు ఫోన్ చేయండి

**కరీం నగర్ అక్టోబర్30 ( సమయం న్యూస్).:** గురువారం బ్యాంకు కాలనీలో గల దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా వోక్సి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ వారి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న యువతకు మహిళా శిశు సంక్షేమ శాఖ లోని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 విభాగం వారు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్ యొక్క సేవల గురించి, ఏవిధంగా ఉపయిగించుకోవాలో, బాల్య వివాహల గురించి, బాలల పై జరుగుతున్న ఆగయిత్యాల గురించి 1098 కి ధైర్యంగా ఫోన్ చేసి తెలుపలనీ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సుందరగిరి సాయికిరణ్ గౌడ్ మరియు ప్రియాంక తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ మమత, శిక్షకులు జక్కుల రాజు, స్పందన, శ్రీనివాస్,యువత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఉప సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ పంతుల గారు



**వరంగల్ అక్టోబర్ 30. (సమయం న్యూస్) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోపనపల్లి మాజీ ఉప సర్పంచ్ సూర అశోక్, మాజీ ఎంపీటీసీ సూర రమేష్ గారి తండ్రి సూర మల్లయ్య గారు ఇటీవల మరణించారు వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని వారి చిత్ర పటానికి పూలమాల ల తో నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరమర్శించిన మాజీజెడ్పీటీసీ లునావత్ పంతులు నాయక్ మాజీ ఎంపీటీసీలు మాడుగుల రాజు కర్మీళ్ళ మోహన్ రావు, మాజీ సర్పంచ్ పంజా మహేష్, బి ఆర్ ఎస్ యూత్ నాయకులు ఇస్లావత్ హరీష్, నాయక్ ఉన్నారు

# నేడు,శుక్రవారం మహేబూబ్ సుభాని గందోత్సవం మైనారిటీ నాయకులు-ఎస్ఎం. గౌసన్


- శనివారం ఉదయం జమే మసీదులో అన్నదాన కార్యక్రమం



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)అక్టోబర్, 30(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం మహెబుబ్ సుభానీ దర్గా గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ నాయకులు ఎస్ఎం. గౌసన్ తెలిపారు.శుక్రవారం జామేమసీద్ నుంచి కొడంగల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని మహేబూబ్ సుభానీ దర్గా వరకు ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సాయంత్రం దర్గా దగ్గర అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అదే విధంగా శనివారం ఉదయం జామే మసీద్ లో అన్నదానం ఉంటుందని తెలిపారు. గందోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా నేడే రన్ ఫర్ యూనిటీ

## - బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి




**పటాన్ చేరు, జిన్నారం, అక్టోబర్ 30(సమయం న్యూస్) :** భారత ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏకతా దివాస్ లో భాగంగా నేడు బొల్లారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కాజిపల్లి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ వద్ద ప్రారంభమై, రెండు కిలోమీటర్ల మేర ఈ రన్ కొనసాగుతుందని ఆయన అన్నారు. సామాజిక ఐకమత్యం, దేశ ఏకతకు ప్రతీకగా ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# మొంజా తుఫాన్ తో రైతులు అప్రమత్తంగా ఉండాలి



**రాయపోల్ అక్టోబర్ 30 :** మొంజా తుఫాన్ ప్రభావంతో వచ్చే రెండు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా వరి, పత్తి, మక్కజొన్న పంటలు కోత దశలో ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జేమ్లు నాయక్ సూచిచారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోత మొక్కజొన్న కోత కోసిన పంటలు తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటికే కోసిన పంటలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. మోంజ తుఫాను ప్రభావ పరిస్థితుల దృశ్య పంట కోతకు వచ్చిన రైతులు తుఫాన్ ప్రభావం తగ్గేదాకా రెండు,మూడు రోజులపాటు పంటలు కోత కాకుండా ఆగి తుపాన్ ప్రభావం ముగిసిన తర్వాత పంటలు కోయాలన్నారు. ఇదివరకే కోసిన పంటలను వర్షం లో తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. తుఫాన్ వర్షా బావ పరిస్థితుల దృశ్య ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మండలంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని,దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు కు పరామర్శ.



**రాయపోల్,అక్టోబర్30:**మాజీ మంత్రి,సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మూడు రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ హరీష్ రావు ను గురువారం ఆయన నివాసం హైదారాబాద్ లో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయన వెంట బిజేపీ ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రాంచంద్రం తదితరులు ఉన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్, అక్టోబర్ 30 (సమయం న్యూస్) :** స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతూ నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ గురువారం నిజామాబాద్ సౌత్ తహసిల్దార్ కార్యాలయంలో ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్షించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా చేపడుతూ, రెండు రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బాధ్యతాయుతంగా పని చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో తప్పకుండా ఉండేలా నిశిత పరిశీలన జరపాలన్నారు. 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభజించడం జరిగిందని గుర్తు చేశారు. ఇందులో కేటగిరీ "ఏ" లో 1987 కంటే ముందు జన్మించి 2002 తో పాటు 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ "బి" లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ "సి" లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ "డి" లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి "ఏ" జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, అది ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని అన్నారు. ఆ తరువాత కేటగిరి సి, కేటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఎఈఆర్ఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓ లు బిఎల్ఓ యాప్ ద్వారా శనివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. సమీక్షలో తహసిల్దార్ బాలరాజు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, జితేందర్, ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# తుఫాన్ నష్టానికి పరిహారం అందేలా కృషి

- మంత్రి తుమ్మల



**ఖమ్మం, అక్టోబర్ 30:(సమయం న్యూస్ ) :** మొంథా తుఫాన్ కారణంగా పేద ప్రజలు కోల్పోయిన ఇండ్లు, పశువులు, పంట, ఇతర నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. గురువారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన కాల్వ ఒడ్డు బ్రిడ్జ్, నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ లలో పర్యటించారు. వాతావరణ శాఖ మొంథా తుఫాన్ పై సమాచారం అందించిన వెంటనే జిల్లా కలెక్టర్, యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముందస్తు చర్యలో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను రిలీఫ్ క్యాంపులకు తరలించడం జరిగిందని అన్నారు. రిలీఫ్ క్యాంపులో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించామని అన్నారు. రాత్రి నిద్ర పోకుండా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ప్రతి అరగంటకు ఒకసారి మానిటర్ చేస్తూ జిల్లా యంత్రాంగం పని చేసిందని మంత్రి ప్రశంసించారు. మున్నేరు నది 26 అడుగుల ఎత్తులో ప్రవహించిందని, నెమ్మదిగా నీటి ప్రవాహం తగ్గుతుందని మంత్రి అన్నారు. మున్నేరు నది పరివాహక ప్రాంతంలో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను కాపాడిన కలెక్టర్, పోలీసులకు, మున్సిపల్ కమీషనర్, ఇతర యంత్రాంగానికి మంత్రి అభినందనలు తెలియజేశారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను తయారు చేయాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పక్కా రిపోర్టు అధికారులు తయారు చేస్తారని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయిన నష్టపోయిన ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 11 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

ప్రస్తుత సీజన్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఖమ్మం నగరానికి ఎటువంటి ప్రమాదం ఉండదని మంత్రి తెలిపారు. రిటైనింగ్ వాల్ పూర్తి చేయడంలో ప్రజలు సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి దంసలాపురం వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి పట్టణంలో బంద్ విజయవంతం

- పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ను, ఫీజు రీయింబర్స్ మెంట్ ను విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్




**పరిగి మున్సిపాలిటీ(మం) అక్టోబర్ 30(సమయం న్యూస్)** ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయడం జరిగిందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగాఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్, పరిగి నియోజకవర్గం నాయకులు శివ, అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని పరిగి పట్టణంలో ఉన్న డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్ కాలేజీలను బందు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్లను ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయాలని అన్నారు. కళాశాలలో కోర్సు అయిపోయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండ యజమాన్యం విద్యార్థులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శివ, అరుణ్, రియాజ్, రెహాన్, షోయిన్, సమీర్, షాహిద్, తల్హా, ఇర్ఫాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

## రెంజల్ మండల వ్యవసాయ అధికారికి షోకాజ్ నోటీసు జారీ



**నిజామాబాద్, అక్టోబర్ 30( సమయం న్యూస్).** ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, రెంజల్ మండల వ్యవసాయ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నవీపేట మండలం అభంగపట్నం, తడ్గాం, రెంజల్ మండలం వీరన్నగుట్ట గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వీరన్నగుట్ట కొనుగోలు కేంద్రం నిర్వహణలో లోటుపాట్లు నెలకొని ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్దేశిత రైస్ మిల్లులకు కాకుండా వేరే మిల్లుకు తరలించడాన్ని కలెక్టర్ తప్పు పట్టారు. ట్రక్ షీట్లు సకాలంలో తెప్పించుకుని, వెంట వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయించడంలోనూ జాప్యం చేస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించని రెంజల్ మండల వ్యవసాయ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశాలలో విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వారి ఖాతాలలో బిల్లుల చెల్లింపులు జరిగేలా కృషి చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కాగా, తుపాను ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. మాయిశ్చర్ మీటర్ ద్వారా కలెక్టర్ స్వయంగా తేమ శాతం పరిశీలించారు. 17శాతానికి లోబడి తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం జరిపించి, మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యాన్ని ఎత్తైన ఖాళీ ప్రదేశాలలో ఆరబెట్టుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ, నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన బిల్లు మొత్తాలతో పాటు, బోనస్ ను కూడా ఎప్పటికప్పుడు రైతుల ఖాతాలలో జమ చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

30-10-25 Samayam_Layout 1 10/30/2025 10:32 PM Page 9



# విజిలెన్స్ నిత్య జీవితంలో భాగంగా కావాలి

- ప్రతి అంశాన్ని మానవీయ కోణంలో చూడాలి
- శతాబ్దాలుగా నీతి, నిజాయతీల ఆవశ్యకత భారతీయ ఆత్మలో మమేకమై ఉంది
- సాంకేతికత వినియోగంతో పారదర్శకత, సులభతర సేవలు
- దోషులను పట్టుకోవడమే కాదు. తప్పులను ముందుగానే నివారించడమే నిజమైన విజిలెన్స్
- సింగరేణి లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో విజిలెన్స్ డీజీ శ్రీమతి శిఖా గోయల్




**సింగరేణి భవన్ హైదరాబాద్, అక్టోబరు 30,( సమయం న్యూస్). :** ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి, నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టర్ జనరల్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శిఖా గోయల్ పేర్కొన్నారు. భారతీయ ఇతిహాసాలతోపాటు శతాబ్దాలుగా వస్తున్న వారసత్వ విలువల్లోనూ సత్య, ధర్మ మార్గంలో వెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు కూడా నిబద్ధతతో పనిచే యాలన్నారు. నీతి, నిజాయతీ, పారదర్శకత పాటించడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయని, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. నిజాయతీతో పని చేయడం ద్వారా ఢిల్లీ మెట్రో రైలును సకాలంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలమని శ్రీ శ్రీధరన్ నిరూపించారని, సహకార రంగంలో పారదర్శకతను పాటించడం ద్వారా అమూల్ ద్వారా క్షీర విప్లవాన్ని సృష్టించిన శ్రీ కురియన్లు కూడా నైతిక విలువలకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. ఇలా ఎందరో వ్యక్తులు నిజాయతీతో సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకున్నారని తెలిపారు. అదే సమయంలో నిజాయతీగా ఉంటూ పనులు చేయకపోవ డం కూడా నేరమే అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిం చుకుంటూ పౌరులకు పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం, నేరస్థులను పట్టుకోవడం కాదని, నేరం జరగకుండా, ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసిన వారి గొప్పతనం గురించి సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆత్మ సంతృప్తి కోసం అంతరాత్మను వంచించకోకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. సింగరేణి 136 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను, సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను, సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం శ్రీమతి శిఖా గోయల్ను ఘనంగా సన్మానిం చారు. సంస్థ డైరెక్టర్లు శ్రీ ఎల్వీ సూర్యనారాయణ, శ్రీ కె వెంకటేశ్వర్లు, శ్రీ గౌతమ్ పొట్రు, శ్రీ తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) శ్రీ టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎం

# వర్షాల వల్ల కలిగిన నష్టంపై సమీక్షించిన కలెక్టర్

- నష్ట పరిహార నివుధిక సకాలం లో పంపండి.




**కరీంనగర్ అక్టోబర్ 30 ( సమయం న్యూస్).:** వర్షాల వల్ల కలిగిన పంట, ఆస్తి నష్టం, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా 8 పశువులు మరణించాయని, వీటి యజమానులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు ఏమైనా ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిహారం అందజేయాలని అన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లుగా సమాచారం ఉందని, రైతు వారీగా తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తిస్థాయిలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎట్టి పరిస్థితుల్లోనూ తడవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే పత్తి కొనుగోలు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల పట్ల రెవెన్యూ, పోలీస్, పంచాయతీ కార్యదర్శులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో నీరు పారుతున్న కల్వర్టుపై నుండి వాహనాలు, మనుషులు వెళ్లకుండా చూడాలని తెలిపారు. చెరువులు, కుంటల నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం కావాలని తెలిపారు. నగరంలో నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు వెళ్ళా వద్దు.

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ అక్టోబర్30 ,( సమయం న్యూస్). :** నదీ పరివాహక ప్రాం తాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది-వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటితో కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తనున్న నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉందని, ఎన్ డి ఆర్ ఎఫ్ టీంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91005 77132 ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆన్లైన్ ఓపెన్ హౌస్

**కొత్తగూడెం అక్టోబర్30 ( సమయం న్యూస్).:** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అందుబాటులో ఉన్న స్కూల్ విద్యార్థులు స్వయంగా ఓపెన్ హౌస్ ను సందర్శించారు.జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొత్తగూడెం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు,విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా డాగ్ స్క్వాడ్ (పోలీసు జాగిలాలు),అల్లర్ల నియంత్రణకు వినియోగించే స్మోక్ గన్, షెల్స్, బాంబు నిర్వీర్య విభాగం యొక్క పని విధానాన్ని వివరించారు.అలాగే డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు,షీ టీం, సైబర్ క్రైమ్ పోలీసుల పనితీరు,భరోసా సెంటర్ ప్రాముఖ్యత,ఫింగర్ ప్రింట్స్,క్లూస్ టీం వంటి వాటిని గురించి విద్యార్థులకు పూర్తి వివరాలు అందించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరం జరిగినట్లయితే వెంటనే ఫిర్యాదు చేసే విధానాలను వివరించారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు చేపట్టే కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డిఎస్పీ రెహమాన్ తెలిపారు.




పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం మనందరి భాధ్యత అని అన్నారు చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు ,కొత్తగూడెం 3టౌన్ సీఐ శివప్రసాద్,1టౌన్ సీఐ కరు ణా కర్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,భరోసా సెంటర్ ఎస్సై అరుణ,షీ టీం ఆర్ఎస్సై రమాదేవి మరియు ఫింగర్ ప్రిం ట్స్, క్లూస్టీంఅధికారులు,డాగ్స్క్వాడ్,సిబ్బంది పాల్గొన్నారు.

# "ఫోరెన్సిక్ సాక్ష్యం పై అవగాహన సదస్సు"

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్30( సమయం న్యూస్).**

జిల్లా న్యాయవాదుల కోసం "ఫోరెన్సిక్ సాక్ష్యం పై అవగాహన కార్యక్రమం - ఒక జ్ఞాన సమీక్ష" శీర్షికతో అవగాహన సదస్సు నవంబర్ 1, 2025 (శనివారం) ఉదయం 10:30 గంటలకు కొత్తగూడెం అడ్వకేట్స్ లైబ్రరీ హాల్లో నిర్వహించబడుతోంది.ఈ కార్యక్రమం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతోంది.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గోపికృష్ణ మరియు మహిళా కన్వీనర్ సుంకర భానుప్రియ మాట్లాడుతూ"నేటి న్యాయవ్యవస్థలో ఫోరెన్సిక్ మరియు శాస్త్రీయ సాక్ష్యాలు అత్యంత కీలకమైనవి. న్యాయవాదులు ఈ రంగంలో అవగాహన పెంపొందించుకోవడం ద్వారా న్యాయన్యాయం సాధనలో మరింత సమర్థవంతంగా వ్యవహరించగలరు. ఈ కార్యక్రమం ప్రతి న్యాయవాదికి ఒక కొత్త దిశ చూపుతుంది. అందువల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం," అన్నారు.ఈ కార్యక్రమంలో డా. మోహన్ ఎర్రగోళ ఫౌండర్% డైరెక్టర్ - ప్రోబ్ ల్యాబ్



ఫోరెన్సిక్, హైదరాబాద్, ప్రధాన వనరుల నిపుణుడిగా పాల్గొని క్రింది అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తారు:

- పాలీగ్రాఫిక్ % ఫింగర్ప్రింట్ టెస్టులు
- నార్కో విశ్లేషణ
- లై డిటెక్షన్
- సంతకం పరీక్ష
- డిజిటల్ ఎవిడెన్స్
- ఫోరెన్సిక్ ల్యాబ్ విధానాలు
- శాస్త్రీయ విశ్లేషణ పద్ధతులు

ఈ అవగాహన సదస్సుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రధాన అతిథిగా, అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సరిత గాల విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు.ఇతర గౌరవనీయ న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా యూనిట్ సభ్యులు అడపాల మహాలక్ష్మి, సాధిక్ పాషా, ఎర్రపాటి కృష్ణ, యెర్రా కామేష్, అంబటి రమేష్, %చీ% నరసింహ చారి, నీలవేణి, మారపాక రమేష్, దొడ్డా సామంత్, మేకల దేవేందర్, పాల రాజశేఖర్, పగిడిపల్లి శ్రీకాంత్ వడ్లకొండ హరిప్రసాద్, లక్ష్మీ సరిత, అంకుష్ పాష , ఇందిరా ప్రియదర్శిని, బేబీ షామిలి ధరావత్ రాధాకృష్ణ, ఎర్ర శ్రీను తదితరులు పాల్గొన్నరూ.

# రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి పంపిణీ

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య






**మంచిర్యాల అక్టోబర్ 30,( సమయం న్యూస్):** నిరుపేద, అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని, నవంబర్ 1వ తేదీ నుండి చౌక ధరల దుకాణాలలో రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేషన్ సన్న బియ్యం కొరకు ఒక వేలిముద్ర, నాన్ ఓవెన్ సంచి కొరకు ఒక వేలిముద్ర ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. ఏ చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు కలిగి ఉన్నారో అక్కడ మాత్రమే వేలిముద్రతో నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడుతుందని, పోర్టబిలిటీ విదానం ద్వారా ఇతర షాపులలో రేషన్ బియ్యం పొందే వారికి నాన్ ఓవెన్ సంచి ఇవ్వబడదని, రేషన్ కార్డుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

30-10-25 Samayam_Layout 1 10/30/2025 10:32 PM Page 10



# ఇందిరమ్మ ఇళ్ల గుత్తేదారిపై కఠిన చర్యలు

● జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**సోనాల అక్టోబర్30 ( సమయం న్యూస్).:** సోనాల మండలం కౌఠ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సందర్భంగా లబ్ధిదారుడిపై దాష్టీకం చేసిన గుత్తేదారు విషయంలో కఠిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై బోథ్ పోలీసు స్టేషన్‌లో నం.201/2025 నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గుత్తేదారు ప్రవర్తనను తీవ్రంగా పరిగణించి, అతన్ని ఇందిరమ్మ హౌసింగ్ పనుల నుండి తొలగించి బ్లాక్‌లిస్ట్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సదరు గుత్తేదారు చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేసి, లబ్ధిదారుల ఇళ్లు ఇతర మేస్త్రీల ద్వారా పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. గుత్తేదారులు, మేస్త్రీలు ఎవరైనా లబ్ధిదారులపై దాష్టీకం లేదా దుర్వినియోగం చేస్తే, భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సరఫరాదారులు, మేస్త్రీలు రిజినబుల్ చార్జీలు తీసుకోవాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు, సందేహాలు ఉన్నట్లయితే మండల తహసీల్దార్, ఎం.పి.డీ.ఓ., ఏ.ఈ. (హౌసింగ్)లను వెంటనే సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో లబ్ధిదారుల పట్ల ఎవరైనా బెదిరింపులు, దుర్వినియోగం లేదా దాష్టీకం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

### డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 పోస్టర్‌ను ఆవిష్కరించిన

# దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ శ్రీమతి హేమ సునీత




**సికింద్రాబాద్ అక్టోబర్30( సమయం న్యూస్). :** – దక్షిణ మధ్య రైల్వే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0ను నవంబర్ 01 నుండి 30 ,2025 వరకు ప్రారంభిస్తోందిదక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ (పి.ఎఫ్.ఏ )శ్రీమతి హేమ సునీత ఈరోజు అనగా అక్టోబర్ 30, 2025న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఆర్థిక సలహాదారు % చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్/జి / శ్రీ అభిషేకానందరావు గారు మరియు పి.ఎఫ్ . ఏ కార్యాలయం లోని ఇతర సీనియర్ అధికారులు మరియు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# జప్తు చేయబడి గోదాములలో నిల్వ ఉంచిన బియ్యం బహిరంగ వేలం

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి.

**సంగారెడ్డి అక్టోబర్, 30 ( సమయం న్యూస్).:** జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద పంపిణీ చేయబడుతున్న బియ్యాన్ని అక్రమంగా వ్యాపారం చేస్తున్న వ్యక్తుల నుండి జప్తు చేయబడి గోదాములలో నిల్వ ఉంచిన బియ్యం సుమారు 3,872.05 క్వింటాళ్ల సరుకు యేలా వున్నదో అలా పద్ధతిన తేదీ 11.11.2025 సాయంత్రం 4:00 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి , నేడు ఒక ప్రకటనలో తెలిపారు . వేలంలో పాల్గొనదలచి ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ గుర్తింపు పొందిన బీవరేజెస్ మరియు డిస్టిలరీ సంస్థల ప్రతినిధులు (ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖల ద్వారా ఆమోదం పొందిన వారు మాత్రమే) తమ సీల్డ్ కోటేషన్లు మరియు సంబంధిత పత్రాలను సమర్పించవలసిందిగా కోరారు. కోటేషన్లు తేదీ 11.11.2025 సాయంత్రం 3:00 గంటల వరకు స్వీకరించబడతాయి. ప్రతినిధుల సమక్షంలో కోటేషన్లు తెరచి పరిశీలించబడతాయి, అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుంది. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయములో సంప్రదించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి తెలిపారు.



హన్మకొండ పరిధి అలంకార్ జంక్షన్ ప్రాంతం లో వరద నీటి ప్రవాహ తీరును జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించిన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్....

# ఆహార కల్తీ నివారణ కోసం విస్తృత తనిఖీలు నిర్వహించాలి

◇ కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్, అక్టోబర్ 30( సమయం న్యూస్). :** ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. ఈ దిశగా కల్తీ ఆహార పదార్థాలను నివారించేందుకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం ఆహార కల్తీ నిరోధక శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హోటళ్ళు, రెస్టారెంట్లు, మాల్స్, టిఫిన్ సెంటర్స్, ఆహార పదార్థాల విక్రయశాలలు, దుకాణాలు తదితర వాటిని క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. ముఖ్యంగా అధిక జనాభా కలిగి ఉండే నిజామాబాద్ నగరంతో పాటు, బోధన్, ఆర్మూర్, భీమ్గల్ మున్సిపల్ పట్టణాలలో తనిఖీలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే రీతిలో కలుషిత ఆహార పదార్థాలను తయారుచేసే, విక్రయించే వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాలలో విద్యార్థులకు అందించే భోజన పదార్థాలలో కూడా కల్తీని నిరోధించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కల్తీ ఆహార పదార్థాలను గుర్తించిన సమయంలో వాటిని సీజ్ చేసి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపాలని, వాటి నివేదికల ఆధారంగా కల్తీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలు, వ్యాపార సంస్థలు తగిన అనుమతులు కలిగి ఉన్నాయా అన్నది పరిశీలిస్తూ, నిర్ణీత గడువును అనుసరిస్తూ వాటిని రెన్యువల్ చేసుకునేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఆహార కల్తీ గురించి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి దాడులు నిర్వహించాలన్నారు. పూర్తి పారదర్శకంగా, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు

## నాణ్యమైన విద్య ను అందించేందుకు కు అన్ని చర్యలు తీసుకోండి.



**ఆదిలాబాద్ అక్టోబర్30( సమయం న్యూస్) :** జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఈ ఎం ఆర్ ఎస్ ప్రిన్సిపాల్స్, అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో సెల్ టవర్స్ ఏర్పాటు చేయడం ద్వారా డిజిటల్ క్లాసులు, ఆన్లైన్ పాఠాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.శుక్రవారం (రేపు) సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా "నేషనల్ యూనిటీ డే" నిర్వహించి, "నశా ముక్త భారత్" ప్రతిజ్ఞను విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది అందరూ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని, సుమారు 480 మంది విద్యార్థులకు టీమ్‌ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీ నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, డిఆర్డీఓ రవీందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, భూ గర్భ జలశాఖ అధికారి శ్రీవల్లి, ప్రిన్సిపాల్స్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# మెంథా తుపాన్ ప్రభావం తో దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన జిల్లాకలెక్టర్



**సూర్య పేట అక్టోబర్30( సమయం న్యూస్).:** మొ ంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటపై , నీట మునిగిన పంటపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.గురువారం నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో ఎర్పుల రామలింగం కి చెందిన పత్తి పంటను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని ఎకరాలలో సాగు చేసారు అని రైతును అడగగా నాలుగు ఎకరాలలో సాగు చేసానని ఒక్కసారి పత్తి తీసామని రెండో సారి తీయుటుకు సిద్ధం అయ్యే లోపు వర్షంతో తడిచి పత్తి దెబ్బ తిన్నదని వివరించారు. తదుపరి నూతనకల్- తాళ్ల సింగారం రోడ్డులో తుమ్మల చెరువు అలుగు పోయటం వల్ల నీట మునిగిన పంటను పరిశీలించారు. పొలాల్లాలో నీరు పోయేందుకు తగ్గిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏ ఈ ని అలాగే పంట నష్టం పై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతులు త్వరగా మా భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ ని కోరగా మీ సమస్య త్వరలో పరిష్కారం కాబోతుందని ఇప్పటికే క్షేత్ర స్థాయి లో పరిశీలన చేసి, నోటీసులు ఇచ్చి,సర్వే చేశామని త్వరలో మీకు పట్టాలు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే సూర్యాపేట- దంతాలపల్లి రోడ్డులో గుండ్ల సింగారం వద్ద పాలేరు వాగు పై ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. అంతకుముందు నూతనకల్ వద్ద ఉన్న మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాం ను ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్ ను పరిశీలించారు. ఎన్ని గన్ని సంచులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు త్వరగా సరఫరా చేయాలని ఆదేశించారు.అక్కడే ఉన్న హమాలీలతో మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాసరావు,ఎంపిడిఓ సునీత, ఏ ఓ మల్లారెడ్డి,ఎంపిఓ శశికళ, ఏ ఈ ఓ భవ్య తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్

### జెమీమా సెంచరీ
### రాణించిన హర్మన్
### సెమీ ఫైనల్‌లో ఆసీస్‌పై రికార్డు విజయం
### మహిళల ప్రపంచకప్



నవీముంబై: మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టైటిల్‌కు టీమిండియా అడుగు దూరంలో నిలిచింది. 52 ఏళ్ల నిరీక్షణకు తెరదించేందుకు చేరువైంది. అసాధారణ ప్రదర్శనతో అద్వితీయమైన విజయంతో హర్మన్‌సేన ఫైనల్ చేరింది. గురువారం నవీ ముంబై వేదికగా జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన టీమిండియా 5 వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌ను ఓడించింది. జెమీమా అజేయ శతకంతో టీమిండియా విజయకేతనం ఎగరవేసింది. ఈ టోర్నీలో ఓటమెరుగని ఆసీస్‌కు పరాజయం రుచి చూపించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (93 బంతుల్లో 17 ఫఫోర్లు, 3 సిక్స్‌లతో 119) విధ్వంసకర శతకంతో చెలరేగగా ఎల్లిస్ పెర్రీ(88 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 77), అష్లే గార్డ్‌నర్(45 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో శ్రీ చరణి(2/49), దీప్తి శర్మ రెండేసి వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్ చెరో వికెట్ తీశారు. చరిత్ర సృష్టించిన భారత్ అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.3 ఓవర్లలో 5 వికెట్లకు 341 పరుగులు చేసి గెలుపొందింది. జెమీమా రోడ్రిగ్స్(134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్) అజేయ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. హర్మన్‌ప్రీత్ కౌర్(88 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 89) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. ఆసీస్ బౌలర్లలో కిమ్ గార్త్(2/46), అన్నబెల్ సదర్లాండ్(2/69) రెండేసి వికెట్లు తీసారు. చెత్త ఫీల్డింగ్‌తో ఆస్ట్రేలియా విజయాన్ని చేజార్చుకుంది. జెమీమా ఇచ్చిన మూడు సునాయస క్యాచ్‌లను నేలపాలు చేసి మూల్యం చెల్లించుకుంది. ఈ గెలుపుతో టీమిండియా చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్‌లోనే అత్యధిక పరుగులు చేధించిన జట్టుగా నిలిచింది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగే ఫైనల్లో సౌతాఫ్రికాతో టీమిండియా తలపడనుంది.

**నిరాశపర్చిన ఓపెనర్లు**

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. ప్రతికా రావల్ స్థానంలో జట్టులోకి వచ్చిన షెఫాలీ వర్మ(10)తీవ్రంగా నిరాశపర్చింది. రెండు బౌండరీలతో జోరు కనబర్చిన షెఫాలీ వర్మను కిమ్ గర్త్ ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. క్రీజులోకి జెమీమా రాగా.. స్మృతి మంధాన ఓ భారీ సిక్సర్‌తో దూకుడు కనబర్చింది. కానీ మంధానను కూడా కిమ్ గార్త్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చింది. అంపైర్ నాటౌటివ్వగా.. రివ్యూతో ఆసీస్ ఫలితం రాబట్టింది. దాంతో పవర్ ప్లేలో భారత్ 2 వికెట్లకు 60 పరుగులే చేసింది.

**ఆదుకున్న జెమీమా, హర్మన్**

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి జెమీమా చెలరేగింది. జెమీమా దూకుడుగా ఆడగా.. క్రీజులో సెట్ అయ్యేందుకు హర్మన్‌ప్రీత్ టైమ్ తీసుకుంది. 57 బంతుల్లో జెమీమా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా బ్యాట్ ఝులిపించింది. బౌండరీలతో ఆసీస్ బౌలర్లపై ఎదురు దాడికి దిగింది. ఈ క్రమంలో హర్మన్ ప్రీత్ కౌర్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. అనంతరం హర్మన్ మరింత దూకుడుగా ఆడింది. భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. 82 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అలనా కింగ్ బౌలింగ్‌లో జెమీమా ఇచ్చిన సునాయస క్యాచ్‌ను వికెట్ కీపర్ అలీసా హీలీ నేలపాలు చేసింది. ఈ అవకాశంతో జెమీమా చెలరేగింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సైతం వేగంగా పరుగులు రాబట్టింది. సెంచరీ దిశగా సాగిన ఆమెను సదర్లాండ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చింది. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 167 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

**విజయ శతకం..**

క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మ కూడా దూకుడు ఆడింది. మూడు బౌండరీలతో జోరు కనబర్చింది. కానీ జెమీమా తప్పిదం కారణంగా ఆమె రనౌట్‌గా వెనుదిరిగింది. దాంతో క్రీజులోకి రిచా ఘోష్ రాగా.. జెమీమా తన క్లాస్ బ్యాటింగ్ కొనసాగించింది. మేఘన్ స్కట్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 115 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకుంది. కానీ జెమీమా ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. కనీసం బ్యాట్ కూడా ఎత్తలేదు. జట్టు విజయమే తన ముఖ్యమని భావించింది. 106 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సదర్లాండ్ బౌలింగ్‌లో జెమీమా ఇచ్చిన మరో సునాయస క్యాచ్‌ను మెక్‌గ్రాత్ నేలపాలు చేసింది. రిచా ఘోష్ భారీ సిక్సర్‌తో దూకుడు కనబర్చింది. కానీ అనవసర షాట్‌తో వికెట్ పారేసుకుంది. దాంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. అమన్‌జోత్‌తో కలిసి జెమీమా విజయం కోసం పోరాడింది. చివర్లో అమన్‌జోత్ కౌర్ రెండు బౌండరీలు బాది విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.

**ఆయన వల్లే ఈ విజయం**

జీసస్ వల్లే విజయం సాధ్యమైందని, ఆయనే తనను నడిపించాడని చెబుతూ టీమిండియా మహిళా బ్యాటర్, మ్యాచ్ విన్నర్ జెమీమా రోడ్రిగ్స్ కన్నీటి పర్యంతమైంది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్(134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్) అజేయ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆఖరి వరకు క్రీజులో నిలబడి విజయలాంఛనాన్ని పూర్తి చేసింది. జెమీమా అసాధారణ ప్రదర్శనతో టీమిండియా 339 పరుగుల రికార్డ్ లక్ష్యాన్ని ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత శతకంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన జెమీమా.. హోస్ట్‌తో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైంది. ఏడుస్తూనే తన ఇన్నింగ్స్ గురించి చెప్పుకొచ్చింది. 'ముందుగా నేను జీసస్‌కు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఎందుకంటే ఆయన వల్లే నేను ఈ ఇన్నింగ్స్ ఆడాను. ఈ రోజు జీసస్ నన్ను నడిపించాడు. నాకు అండగా నిలిచిన మా అమ్మ, నాన్న, కోచ్‌తో పాటు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. గత నెల నాకు చాలా కష్టంగా గడిచింది. కానీ ఈ ఇన్నింగ్స్ నాకు ఒక కలలా అనిపిస్తుంది. ఈ విజయం ఇంకా నా మదిలోకి ఎక్కలేదు. నేను స్నానం చేయడానికి వెళ్తుండగా మూడో స్థానంలో బ్యాటింగ్ చేయాలని చెప్పారు. ఎలాగైనా ఈ మ్యాచ్ గెలవాలని అనుకున్నాను. నా కోసం కాకుండా జట్టు కోసమే ఆడాను. గతంలో మేం కీలకమైన మ్యాచ్‌లు ఓడిపోయాం. ఈ సారి ఆ తప్పిదం చేయకూడదని గట్టిగా అనుకున్నాను. హాఫ్ సెంచరీ, సెంచరీ ఏదీ నేను పట్టించుకోలేదు. జట్టు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకే సెంచరీని సెలెబ్రేట్ చేసుకోలేదు.

**అప్పుడు రోజు ఏడ్చాను.**

గతేడాది ప్రపంచకప్ జట్టులో నాకు చోటు దక్కలేదు. అప్పుడు ఫామ్‌లో ఉన్నా నాకు అవకాశం దక్కలేదు. ఆ సమయంలో నేను తీవ్ర మానసిక వేధనను అనుభవించాను. ప్రతీ రోజు ఏడుస్తూ కూర్చున్నాను. మరింత ఎక్కువగా కష్టపడి జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాను. నేటి ఇన్నింగ్స్‌లో ఆ దేవుడు నాకు అండగా నిలిచాడు. బ్యాటింగ్ చేసే సమయంలో నాతో నేను ఎక్కువగా మాట్లాడుకున్నాను. బైబిల్‌లో ఒక వ్యాక్యాన్ని పదే పదే ఉటంకించాను. ఆ బైబిల్ వ్యాఖ్యలతో 'నిశ్చలంగా ఉండు.. ఆ దేవుడు నీ కోసం పోరాడుతాడు.'అనే బైబిల్ వ్యాఖ్యాన్ని పదే పదే మనసులో అనుకున్నాను. అందులో ఉన్నట్లుగానే ఆ దేవుడు నా కోసం పోరాడాడు. ఈ విజయం ఇచ్చిన ఆనందాన్ని నేను మాటల్లో చెప్పలేను. హర్మన్ ప్రీత్ కౌర్ వచ్చినప్పుడు మంచి భాగస్వామ్యం నమోదు చేయాలని భావించాం.చివర్లో నేను దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాను. కానీ అది నా వల్ల కాలేదు. దీప్తి శర్మ ప్రతీ బంతికి నాతో మాట్లాడి నన్ను కూల్ చేసింది. నా సహచర ఆటగాళ్లు నాకు అండగా నిలిచారు. ఈ గెలుపు క్రెడిట్ నా ఒక్కదానిదే కాదు. సమష్టిగానే ఈ విజయం దక్కింది. ప్రేక్షకుల మద్దతు, వారి అరుపులు నన్ను మరింత ఉత్సాహపరిచాయి.'అని జెమీమా చెప్పుకొచ్చింది. జెమీమా చెప్పినట్లుగా ఆమెకు దేవుడు అండగా నిలిచాడు. ఆమె ఇచ్చిన మూడు సునాయస క్యాచ్‌లను ఆసీస్ ఆటగాళ్లు వదిలేసారు.



# ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

### మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20
### ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్
### అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకునే చాన్స్



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్దమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్‌బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబె మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.

రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

**ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:**

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా,

# ముంబయి ఇండియన్స్‌ను వీడనున్న రోహిత్ శర్మ!?




సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ ఐపీఎల్ ఫ్యూచర్‌పై మరోసారి చర్చ మొదలైంది. వచ్చే సీజన్‌కు అతడు ముంబయి ఇండియన్స్‌ను వదిలి కోల్‌కతా నైట్?రైడర్స్ ఫ్రాంచైజీకి మారనున్నాడని, ఆ దిశగా అడుగులు పడుతున్నాయని రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. రెండేళ్ల కిందట రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడంతో, వచ్చే సీజన్‌కు రోహిత్ నిజంగానే ముంబయిని వదిలేసి కేకేఆర్‌కు ఆడాలనుకుంటున్నాడేమోనని నెటిజన్లు అనుకుంటున్నారు. దీనికితోడు కోల్‌కతా రీసెంట్‌గా చేసిన ఎక్స్ పోస్టు ఆజ్యం పోసినట్లైంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో 202 పరుగులతో రాణించి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన రోహిత్ వన్డే ర్యాకింగ్స్‌లో రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో కెరీర్‌లో తొలిసారి టాప్ ప్లేస్‌లోకి దూసుకెళ్లాడు. దీంతో రోహిత్‌కు మాజీ క్రికెటర్లు, సహచరులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా ఓ పోస్ట్ చేసింది. ఈ పోస్టుకు ఓ నెటిజన్ రిప్లై ఇస్తూ 'కేకేఆర్‌కు రోహిత్ వస్తున్నాడా' అని కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌కు కేకేఆర్ 'కన్ఫార్మ్, వరల్డ్ నెం.1 వన్డే బ్యాటర్' అని రిప్లై ఇచ్చింది. దీంతో ఈ వార్తలకు బలం చేకూరింది. 'కన్ఫార్మ్ అంటే అర్థం ఏంటి' అని కొందరు అడగగా, మరికొందరు ఐపీఎల్ చరిత్రలోనే అతిపెద్ద ట్రేడింగ్ డీల్ చూడనున్నామంటూ కామెంట్లు పెట్టారు. దీంతో అభిమానులు కన్ఫ్యూజన్‌కు గురవుతున్నారు. రోహిత్ కోల్?కతాకు వెళ్లడం ఖాయ-ంమేనని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ తాజా పోస్టుతో ఈ ప్రచారాలకు గురువారం తెరదించింది. 'రేపు మళ్లీ సూర్యుడు ఉదయ-ంస్తాడు. అది మాత్రం పక్కా నిజం. కానీ రాత్రి ( వేళలో సూర్యుడు ఉదయించడం కష్టమే కాదు అసాధ్యం కూడా' రాసుకొచ్చింది. దీనికి బ్యాగ్రౌండ్‌లో ముంబయి లోగోతో ఉన్న రోహిత్ ఫొటోను షేర్ చేసింది. ఈ పోస్టులో కేకేఆర్‌కు సంబంధించిన నైట్ అనే ఇంగ్లీష్ పదాన్ని హైలైట్ చేసింది. దీంతో రోహిత్ కేకేఆర్‌కు వెళ్లనున్నాడన్న ప్రచారాన్ని పరోక్షంగా ముంబయి కొట్టిపారేసింది! ఇలా తాజా పోస్టుతో ఫ్యాన్స్ కన్ఫ్యూజన్‌కు ముంబయి ఫ్రాంచైజీ క్లారిటీ ఇచ్చింది. కాగా, ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో రోహిత్ శర్మ సక్సెస్‌ఫుల్ ప్లేయర్లలో ఒకరు. బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్సీలోనూ తనదైన మార్క్ చూపిస్తూ తమ ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లు అందించాడు. 2013, 2015, 2017, 2019, 2020 సీజన్లలో ముంబయిని రోహిత్ ఛాంపియన్‌గా నిలిపాడు. 2011లో ముంబయితో చేరిన రోహిత్ 14ఏళ్లుగా అదే జట్టుతో కొనసాగుతున్నాడు. అయితే రెండేళ్ల కిందట రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి ఆ బాధ్యతలు హార్దిక్ పాండ్యకు అప్పగించింది. దీంతో గత రెండు సీజన్లలో రోహిత్ ప్లేయర్‌గానే కొనసాగుతున్నాడు. అప్పట్నుంచి రోహిత్‌కు ముంబయి మేనేజ్‌మెంట్‌కు మధ్య గ్యాప్ పెరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది.

31-10-25 Samayam_Layout 1 10/31/2025 3:24 AM Page 12



# నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

## బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ




తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉ ండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడించిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

# రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

## కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయి-ంతే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం








## గ్లామర్ తో కట్టిపడేస్తున్న రకుల్..

రకుల్ ప్రీత్ సింగ్ తాజా ఇంస్టాగ్రామ్ ఫోటోలతో అభిమానులను ఆకర్షించింది.. కుర్రకారు మతి పోగొట్టే స్టన్నింగ్ ఫోజులతో ఉన్న తాజా ఫోటోలు నెట్టింట షేర్ చేసింది. అజయ్ దేవగన్ తో కలిసి రకుల్ ప్రీత్ సింగ్ దేదే ప్యార్ దే -2 మూవీ కోసం రెడీ అవుతోంది..ఈ మధ్యనే ఈ మూవీ "జూమ్ షరాబీ"అనే పాటను మూవీ మేకర్స్ విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది.అయితే తాజాగా ఈ పాటను మరోసారి గుర్తు చేస్తూ రకుల్ ప్రీత్ సింగ్ తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని అద్భుతమైన ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోలలో తన స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ హాట్ ఫోటోలతో పాటు రకుల్ ప్రీత్ సింగ్ " ఆయేషా పూచ్ రహి హై జూమ్ షరాబీ కైసా లగా?. చ%నవనవజూ-ఝతీనవ%2 అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఫోటోలతో పాటు ఆమె పెట్టిన యాష్ ట్యాగ్ కూడా నెట్టింట్లో ట్రెండింగ్ లో ఉంది.రకుల్ ప్రీత్ సింగ్ ఈ పోస్ట్ పెట్టిన కొద్ది క్షణాలకే చాలా మంది ఆమె అభిమానులు హార్ట్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఓ నెటిజన్ ఏకంగా రకుల్ ప్రీత్ సింగ్ ఫోటోలకు నా హృదయ రాణి అని కామెంట్ పెట్టారు. ఆ ఫోటోల్లో రకుల్ ప్రీత్ సింగ్ ఉదయాన్నే బెడ్ మీద నుంచి లేచి ఎలా అయితే ఒళ్ళు విరుస్తారో అలాంటి హాట్ ఫోజులు పెట్టింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారడంతో పాటు ఆమె పెట్టిన పోస్ట్ కు సంబంధించిన పాట కూడా ఇంటర్నెట్ లో ట్రెండింగ్ లో ఉంది.. ఇక రకుల్ ప్రీత్ సింగ్ సినీ పర్సనల్ కెరీర్ విషయాలకు వస్తే.. ఈ ముద్దుగుమ్మ తెలుగులో కెరటం అనే మూవీ తో వచ్చినప్పటికీ ఈ సినిమా అంత పేరు తెచ్చిపెట్టలేదు. కానీ ఆ తర్వాత సందీప్ కిషన్ తో చేసిన వెంకటాద్రి ఎక్స్ప్రెస్ మూవీ హిట్ కొట్టడంతో రకుల్ కి టాలీవుడ్ లో మంచి ఆఫర్స్ వచ్చాయి.అలా ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగార్జున, నాగ చైతన్య, మహేష్ బాబు వంటి స్టార్ హీరోలతో నటించింది.


# నా నటనకు రిటైర్మెంట్ లేదు

## మాస్ జాతర హీరో రవితేజ



'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు.ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.

# మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్



'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా (ం÷ఖబరజా౹ ఐరజీనినిజీ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ (ఖసజీబజీనిబిర ÷ఎజీసపజీ) మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**